## 10. శ్రీ శ్రీ

కవిత్వాన్ని జీవితానికి చేరువుగా తీసుకువచ్చిన అభ్యుదయ కవిత్వ భగీరథుడు శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ).1940 తర్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్య లోకాన్ని ఉత్తేజితం చేసిన మూలవిరాట్ శ్రీ శ్రీ.

శ్రీశ్రీ 1910 ఏప్రిల్ 30వ తేదీన విశాఖపట్నంలో జన్మించారు. తల్లిదండ్రులు వెంకటరమణమ్మ,అప్పలకొండ.వీరి ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నం లో జరిగింది.1931 లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బి.ఏ పూర్తి చేశారు.

**శ్రీశ్రీ రచనా ప్రస్థానం:** శ్రీశ్రీ కవితా వ్యాసంగంలో మూడు ముఖ్య దశలు ఉన్నాయి. శ్రీశ్రీ తన 18 వ ఏట 1928 లో 'ప్రభవ' అనే కవితా సంపుటిని రాశారు. తరువాత ఛందో బంధాలను విదిలించుకుని 1929లో 'సుప్తాస్థికలు' అనే కవితా ఖండికలో కవిత్వానికి అంకురార్పణ చేశారు. శ్రీశ్రీ రచించిన వచన గేయం విద్యున్మాలికలు. 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అని శ్రీశ్రీ జయభేరి గేయాన్ని రచించారు 1933లో

రచించారు. 1934 ఏప్రిల్ 12వ తేదీన 'మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది' అనే చారిత్రాత్మక గేయాన్ని సృష్టించారు. ఈ గేయమే అభ్యుదయ కవిత్వానికి నాంది గీతంగా మారింది.

మహాప్రస్థానం సంపుటిలో

**మరో ప్రపంచం మరో ప్రపంచం**

**మరో ప్రపంచం పిలిచిందీ**

**పదండి ముందుకు పదండి తోసుకు**

**పోదాం పోదాం పైపైకి**

అని ఉత్తేజపూర్వకంగా, సంచలనాత్మకంగా ఈ ఖండిక రాశారు. 'ప్రతిజ్ఞ ' అనే గేయంలో శ్రీశ్రీ శ్రామిక వర్గ చైతన్యాన్ని ప్రకటించారు. శ్రమశక్తి విలువను చాటారు.

**పొలాలనన్నీ హలాల దున్నీ**

**ఇలా తలంలో హేమం పిండగ**

**ఘర్మజలానికి ధర్మజలానికి**

**ఖరీదు కట్టే షరాబు లేడోయ్.** అని ప్రకటించారు.

శ్రామిక జీవుల్లో తిరుగుబాటుకు ఊపిరి పోశాడు. తన కవిత్వాన్ని వారికోసమే సృష్టిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. "శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని" వక్కాణించాడు. 'అవతారం' అనే ఖండిక పాలకులకు వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటును సూచిస్తుంది.

**జ్వాలాతోరణం, ఐ, భిక్షువర్షీయసి, ఆః** మొదలైన గేయాలు మహాప్రస్థానంలో అత్యంత శక్తివంతమైన రచనలు.

**సిరిసిరిమువ్వ** అనే మకుటంతో సమాజంలోని విభిన్న అంశాలపై శ్రీశ్రీ శతకం రచించారు. శ్రీశ్రీ ఈ శతకంలో అధిక్షేపాన్ని చక్కగా వినియోగించుకున్నారు. నిత్యము జరిగే రాజకీయాలే వస్తువుగా తీసుకుని శ్రీ శ్రీ **ఖడ్గ సృష్టి** అనే కవితా సంపుటిని ప్రచురించారు. అనితరసాధ్యమైన తిరుగుబాటు ధోరణి లో సాహిత్యంలో మరో ప్రపంచానికి బాట వేసిన కీర్తి శ్రీశ్రీకే దక్కుతుంది.

**ప్రాస క్రీడలు** గేయం రూపంలో ఉన్న కార్టూన్లు. సున్నితమైన హాస్యం , ఘాటైన వ్యంగ్యం వీటిలో పుష్కలంగా ఉంటాయి.**లిమరిక్కులు** శ్రీశ్రీ రచించిన 5 పాదాలు వచన గీతం.

**శ్రీశ్రీ మహాప్రస్థానం, మరో ప్రస్థానం, ఖడ్గసృష్టి** అనే కవితా సంకలనాలను, **చరమరాత్రి** అనే కథల సంపుటిని, రేడియో నాటికలు రచించారు. "కాదేదీ కవితకనర్హం" అనే శ్రీశ్రీ వాక్కును నవతరం కవులు పాటించి కవిత్వ రంగంలో ప్రవేశించారు .

అభ్యుదయ ధోరణిని కళాత్మకంగా వ్యక్తీకరించడం వల్లనే శ్రీ శ్రీ కవిత్వం ఈనాడు, పత్రికలలో, సినిమాలలో,ప్రజల నోళ్లలో సుస్థిర స్థానం పొందింది. ఈ విధంగా 'అనితర సాధ్యం నా మార్గం' అనే మాటను శ్రీ శ్రీ నిలబెట్టుకున్నాడు.

సరికొత్త ప్రయోగాలు చేసిన అభ్యుదయ విప్లవ కవిత్వం యుగకర్త శ్రీశ్రీ